# ఫుల్ జోష్..!

## రజతోత్సవ సభ సక్సెస్‌తో గులాబీ శ్రేణుల నూతనోత్సాహం

**కేసీఆర్ ప్రసంగంతో మరింత ఆత్మ విశ్వాసం**

**రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని శ్రేణుల ధీమా**



**గులాబీ పార్టీలో నూతనోత్సాహం ఉరుకలేస్తున్నది. వరంగల్ జిల్లా ఎల్కతుర్తి వేదికగా జరిగిన పార్టీ రజతోత్సవ సభ విజయవంతం కావడంతో గ్రేటర్ గులాబీ శ్రేణుల్లో మరింత రెట్టింపు ఉత్సాహం నెలకొంది. గడిచిన కొన్ని రోజులుగా రజతోత్సవం నేపథ్యంలో సన్నాహక సమావేశాలతో నియోజవర్గాలను గులాబీ మయం చేసి హోరెత్తించారు. ఈ క్రమంలోనే ఎల్కతుర్తి సభకు భారీగా శ్రేణులు తరలివెళ్లారు. పాతకేళ్ల పార్టీ ప్రస్థానం, పదేండ్ల పాలన, 16 నెలల కాంగ్రెస్ పాలన లోపాలపై కేసీఆర్ ప్రసంగించిన తీరును శ్రేణులను ఆకట్టుకున్నది. భవిష్యత్ పార్టీ కార్యాచరణపై పార్టీ అధినేత కేసీఆర్ శ్రేణులను దిశా నిర్దేశం చేశారు. ఇదే జోష్‌తో మరింత ఉత్సాహంగా పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు ముఖ్య నేతలు, శ్రేణులు, కార్యకర్తలు సిద్ధమవుతున్నారు. కేసీఆర్ ప్రసంగంతో మరింత ఆత్మ విశ్వాసం పెరిగిందని, రాబోయే రోజుల్లో మరింత ఉత్సాహంతో పనిచేస్తామని శ్రేణులు ధీమా వ్యక్తం చేస్తున్నారు.**

**- సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ):**

### గులాబీ మయంగా వరంగల్ హైవే..

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలివెళ్లిన వాహనాలతో వరంగల్ హైవే గులాబీమయంగా మారింది. ఆదివారం ఉదయం నుంచి నగరంలోని నలుమూలల నుంచి వచ్చిన వాహనాలు ఉప్పల్ చౌరస్తా మీదుగా వరంగల్‌లో హైవేలోకి ప్రవేశించాయి. సభకు వెళ్లే వాహనాలతో ఉప్పల్ నుంచి భువనగిరి వరకు వాహనాలు బారులు తీరాయి. ఎటూ చూసిన హైవేపై జై కేసీఆర్ నినాదాలు మారుమోగాయి. వివిధ ప్రాంతాల నుంచి ఈ రూట్‌లో వరంగల్ సభవేదిక వద్దకు ప్రయాణం సాగించిన పార్టీ శ్రేణులు సాధారణ వాహనదారులకు ఎక్కడికక్కడ రూట్ క్లియర్ చేస్తూ ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకున్నారు.వేల సంఖ్యలో వాహనాలతో ఈ హైవే కిక్కిరిసిపోవడంతో నెమ్మదిగా వాహనాలు ముందుకు కదుల్తూ వెళ్లాయి.

### మేడ్చల్ జిల్లా నుంచి..

మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాలకు చెందిన ఎమ్మెల్యేలు మల్లారెడ్డి, మర్రి రాజశేఖర్‌రెడ్డి, కేపీ వివేకానంద్, మాధవరం కృష్ణారావు, లక్ష్మారెడ్డి నేతృత్వంలో వేలాది సంఖ్యలో వాహనాలు, కార్లలో వరంగల్ బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వెళ్లారు. ఉదయం మధ్యాహ్నం 12 గంటల నుంచే వరంగల్‌కు వాహనాలు తరలాయి. జిల్లా నుంచి సుమారు 50 వేల మంది తరలివెళ్లినట్లు బీఆర్ఎస్ నాయకులు అంచనా వేస్తున్నారు.



బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌తో ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు




సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని మాస్కులతో బస్సులో వెళ్తున్న బోయిగూడలోని ఐడీహెచ్ డబుల్ బెడ్రూం కాలనీవాసులు



ప్రొఫెసర్ జయశంకర్ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న కేటీఆర్, బీఆర్ఎస్ నేతలు



కార్యకర్తలతో కలిసి బస్సులో వెళ్తున్న బీఆర్ఎస్ మహిళా నేత నివేదిత



అత్తాపూర్ బీఆర్ఎస్ నాయకులతో కలిసి రజతోత్సవ సభకు వెళ్తున్న రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి



జై కేసీఆర్ అంటూ బస్సులో సభకు తరలివెళ్తున్న బీఆర్ఎస్ మహిళా నేతలు



బీఆర్ఎస్ మహిళా నేతల ఆనందోత్సాహం



వివేకానంద నగర్ నుంచి ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ శ్రేణులు



పద్మారావు నగర్‌లో జెండా ఊపి సభకు వెళ్లే బస్సులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



ఎల్‌బీనగర్ నుంచి కార్లలో ర్యాలీగా వెళ్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

## అంచనాలకు మించి జనం



సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ):హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ గ్రాండ్ సక్సెస్ అయ్యిందని టీఎస్‌టీఎస్ మాజీ చైర్మన్ పాటిమీది జగన్మోహన్‌రావు హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. రజతోత్సవ సభకు అంచనాలకు మించి జనం తరలివచ్చారన్నారు. తెలంగాణ జాతిపిత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, అభివృద్ధి ప్రదాత కల్వకుంట్ల చంద్రశేఖర రావు ప్రసంగాన్ని వినేందుకు గులాబీ శ్రేణులు, అభిమానులు ఎల్కతుర్తి బాట పట్టారన్నారు. అలాగే కేసీఆర్ ప్రసంగాన్ని టీవీల్లో, సామజిక మధ్యమాల ద్వారా లక్షల మంది వీక్షించారన్నారు. కేసీఆర్ స్ఫూర్తిదాయక, ఉత్తేజిత ప్రసంగాన్ని విని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై వాడవాడలా చర్చ మొదలైంది. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండేదన్నారు. మోసపూరిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ ప్రజలను నిండా ముంచిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన ఆరు హామీల అమలుపై శ్రద్ధ వహించకుండా కేవలం కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీపై అక్కసు వెళ్లగక్కుతోందని విమర్శించారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్‌ను పూర్తిగా నాశనం చేశారు. కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఛీదరించుకుంటున్నారు. ఎన్నికలు ఎప్పుడు వచ్చినా బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయం.




బౌద్ధ నగర్ డివిజన్లో జెండా ఊపిరి ర్యాలీ ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పద్మారావు గౌడ్

## రజతోత్సవం సక్సెస్

బీఆర్ఎస్ పార్టీ ఆవిర్భవించి 25 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన రజతోత్సవ బహిరంగ సభ సూపర్ సక్సెస్ కావడంపై ఆ పార్టీ నేతలు, క్యాడర్‌లో నూతన ఉత్సాహం కన్పిస్తోంది.

### కార్యకర్తలకు కృతజ్ఞతలు



ఉమ్మడి రంగారెడ్డి జిల్లా నుంచి బీఆర్ఎస్ బహిరంగ సభకు తరలి వచ్చిన బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు, స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలకు కృతజ్ఞతలు. మండే ఎండను సైతం లెక్కచేయకుండా కేసీఆర్ నాయకత్వమే శ్రీరామరక్షగా ప్రజలు తరలివచ్చారు. బీఆర్ఎస్ పార్టీ పట్ల ప్రజలకు బలమైన నమ్మకం ఉంది. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి కేవలం కేసీఆర్‌తోనే సాధ్యమని ప్రజలు విశ్వసిస్తున్నారు.

– సబితారెడ్డి, ఎమ్మెల్యే, మహేశ్వరం

### కేసీఆర్ ప్రసంగం హైలెట్



బీఆర్ఎస్ రజతోత్సవసభ చరిత్ర సృష్టించింది. సభకు కనీవినీ ఎరుగని రీతిలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు లక్షలాదిగా తరలివచ్చారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన రాష్ట్ర విధ్వంసంపై కేసీఆర్ ప్రసంగం హైలెట్‌గా నిలిచింది. సభలో ప్రజాస్పందన చూస్తే భవిష్యత్‌లో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్‌దే విజయమని స్పష్టం అవుతోంది.

– చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యే, మేడ్చల్

### కాంగ్రెస్ వాగ్దానాలను ఎండగట్టారు



వరంగల్ ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభ దద్దరిల్లింది. చాలా రోజుల తర్వాత కేసీఆర్ స్పీచ్ వినడం సంతోషంగా ఉంది. కాంగ్రెస్ పార్టీ మోసపూరిత వాగ్దానాలను కేసీఆర్ సభలో ఎండగట్టారు. పార్టీ నాయకులు కార్యకర్తలకు ధైర్యం నింపారు ట్రాఫిక్ జామ్ వల్ల ఇంకా రెండు మూడు లక్షల మంది బహిరంగ సభకు రాలేకపోయారు. మొత్తం మీద సభ విజయవంతమైంది.

– కాలేరు వెంకటేశ్, ఎమ్మెల్యే

### కార్యకర్తల్లో నూతన ఉత్సాహం



ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో పార్టీ అధినేత కేసీఆర్ ఇచ్చిన ప్రసంగం నేతలు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపింది. స్వయంగా కేసీఆర్ ఉద్యమస్ఫూర్తితో ప్రభుత్వంపై రానున్న రోజుల్లో పోరాట పంథాలో నడుస్తామని చెప్పడంతో కార్యకర్తల్లో హర్షం వ్యక్తమవుతోంది.

– కేపీ వివేకానంద్, ఎమ్మెల్యే, కుత్బుల్లాపూర్

### భవిష్యత్ బీఆర్ఎస్‌దే



రజతోత్సవ వేడుక ఊహించిన దానికంటే పెద్ద సక్సెస్ అయ్యింది. లక్షలాదిమంది ప్రజలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా తరలివచ్చి బీఆర్ఎస్ పార్టీపై తమకున్న అభిమానాన్ని మరోసారి చాటుకున్నారు. మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీకి ఈ సభతోనైనా కనువిప్పు కలగాలి. కార్యకర్తలు ధైర్యంగా ఉండాలి. భవిష్యత్ బీఆర్ఎస్‌దే.

– శంభీపూర్ రాజు,ఎమ్మెల్సీ